ఈ వారం కథ

# ఆకలి-ఆడది

- గుండెబోయిన శ్రీనివాస్

ముసురు,
ఒకటే ముసురు.
వారం రోజులుగా ముసురు వాళ్ల ఉసురు పోసుకుంటోంది.
ఏపూట కాపూటే వెళ్లమార్చుకునే జనం కుక్కిన పేనుల్లా
గుడిసెల్లో పడి వుంటున్నారంటే అందుకు ముసురే కారణం.
పూర్తిగా వెలిసీ చావదు. గట్టిగా కొట్టీ చావదు. చావకుండా
బతుకకుండా జనాన్ని గుడిసెల్లోనే చంపుతోంది.



ముసురువల్ల గుడిసెల్లోని ప్రజలకు పని కరువయ్యింది. పని కరువై తినడానికి తిండి కరువయ్యింది. అందుకే ఎవడి గుడిసెలో ప(ం)డి వాడే గొణుక్కుంటున్నాడు. వర్షం మీద నోటి కొచ్చిన తిట్ల వర్షం కురిపిస్తున్నారు. అయినా ముసురు తగ్గడం లేదు. వాళ్ల తిట్లు ఆగడం లేదు.

అది హన్మకొండ పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంకి ఎదురుగా వున్న ప్రాంతం అక్కడ మామూలు రోజులలోనే గుడిసెల చుట్టూ పట్టణంలోని మురికి నీరుచేరి నిలవ వుంటుంది. అలాంటిది ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వల్ల ఆ ప్రాంతమంతా మురికి వాసనతో గుడిసె వాసుల ముక్కు పుటా లదరగొడుతోంది. దీనికి తోడు ఆగి ఆగి వీస్తున్న ఈదరగాలికి పూరి పాకలు గల గలా శబ్దం చేస్తున్నాయి. గుడిసెల్లోని జనం చలికి తట్టుకోలేక పొయ్యిల్లోనే నెగళ్లు పెట్టుకున్నారు. ఇంకొందరేమో దొరికిన వస్త్రాలు కప్పుకుని చలి బారి నుండి తమ్ము తాముకాపాడుకుంటున్నారు.

ఆకాశం ఉన్నట్టుండి ఒక్కసారి ఉరిమింది. గుడిసెలో పొయ్యి వద్ద చలి కాచుకుంటున్న లక్ష్మికి, భర్త పిలుపు కూడా ఉరుము లాగే వినిపించింది.

"ఏంది? ఎందుకో పిలుత్తివి" అంటూ భర్త సారయ్య దగ్గరకు వచ్చింది.

పిలవనైతే పిలిచాడు కాని అర నిమిషం గడచిపోయినా సారయ్య ఏమీ చెప్పకపోగా తన వైపే చూస్తున్నాడు. పిలుపులో ధ్వనించిన కరుకుదనం చూపుల్లో కన్పించడం లేదు. ఏదో చెప్పాలనుకుని, చెప్పలేక జాలిగా చూస్తున్నాడు. లక్ష్మికి పరిస్థితి అర్థమయ్యింది. మూడు రోజుల నుండి మంచి నీళ్ళు తప్ప మరేమీ ముట్టలేదు. తన పరిస్థితి కూడా అలాగే వుంది. కడుపులో పేగులు బొబ్బ పెడుతున్నాయి. అప్పుడిన్ని, ఇప్పుడిన్ని వెనకేసిన పైసలతో అయిదారు రోజులు కూకొని తినాల్సి వచ్చింది. చేబదులుకు వెళదామన్నా అందరి పరిస్థితి అలాగే వుంది. ముసురు మూలంగా ఏర్పడిన దుస్థితి ఇది.

కుక్కి మంచంలో ఏడాది కొడుకును కాళ్ళ



ప్రాణాధారమైన జీవశక్తి లోపించి, సుఖమయమైన జీవితానికి దూరమవుతున్నారా?

నీరసం, నిసత్తువ, బలహీనతలతో బాధపడుతున్నారా?

మగవారి కోసం నూతన ప్రక్రియ ద్వారా తయారుచేయబడిన దివ్య ఔషధము.

ఫిజికెమ్ వారి

ఒజోమెన్
క్యాప్సుల్స్

అనుభవము కల్గిన ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో తయారుచేయబడిన 'ఒజోమెన్' క్యాప్సుల్స్ వాడి మీ సుఖమయమైన జీవితాన్ని పునఃప్రారంభించండి.

అన్ని ప్రముఖ మందుల షాపులలో లభించును.

fizikem

MANUFACTURED IN INDIA BY
fizikem LABORATORIES
VIJAYAWADA - 520 001 (A.P.)

SHAH

మీద కూర్చోబెట్టుకుని నిండా చద్దరు కప్పుకుని కూర్చున్నాడు సారయ్య. మరి కొంత సేపయ్యాక తేరుకున్న వాడిలాగా మెల్లగా అన్నాడు. "నీకు మేస్త్రీ పైసలియ్యాలంటివి కదా! అడుక్కురారాదు" అని. ఇప్పటి వరకూ తనకా విషయం గుర్తే లేదు. ముందే గ్యాపకముంటే మూడు పూటలు మాడేవాళ్లం కాదు గదా అని లక్ష్మి మనసులోనే బాధపడింది.

ముసురులో బయటికి వెళ్ళాలంటే లక్ష్మికి మనసొప్పడం లేదు. కాని వెళ్ళక తప్పేటట్టు లేదు. ఆకలి తీరాలంటే మరో మార్గం కనిపించడంలేదు. మనిషి అవసరాలలో ఆకలి తరువాతే కదా మిగతావన్నీ కూడా.

వినుకులకు తడవకుండా లక్ష్మి వరకు (ప్లాస్టిక్ కవరు)ను నెత్తి నుండి పిక్కల దాకా కప్పుకుంది. పిల్లగాడు పైలం అంటూ భర్తతో చెప్పి గుడిసె నుంటి బయటికి నడిచింది. కానీ సారయ్య మాత్రం ఆలోచనల నుండి బయటపడలేదు.

గుడిసె చుట్టూ ఎడతెగని ముసురులాగే సారయ్య చుట్టూ ఆలోచనలు ముసురుకున్నాయి. వర్షం వల్ల వారం రోజులుగా ఒక్క సవారీ లేదు. రిక్షా లాగిన డబ్బుతో మనసారా సారా తాగి వచ్చినా భార్య పల్లెత్తు మాటనేది కాదు. ముసురు చెయ్యబట్టే వారం రోజులుగా రిక్షా లాగడం బలవంతంగా మానేయాల్సి వచ్చింది. అందుకే మనసు సారా వైపు లాగుతున్నా, కాసుల లేమి తనను కట్టిపడవేసిందని సారయ్య మధన పడుతున్నాడు. ఇంతలో పిల్లగాడి ఏడుపు వినిపించడంతో ఆలోచనల నుండి బయటపడ్డాడు. కొడుకుని జోకొడుతూ మళ్లీ ఆలోచనల్లో మునిగిపోయాడు.

సారయ్యది వరంగల్ జిల్లా ఏటూరు నాగారం దగ్గర చిన్న పల్లెటూరు. రెండుసార్లు వచ్చిన గోదావరి వరదలకు ఊరు, ఊరుతో పాటు వున్న గొడ్డూ గోదా కొట్టుకుపోయాయి. పొలం కూడా మేటలు వేసి కయ్యలు కోసి ఎందుకూ పనికి రాకుండా తయారయ్యింది. అందుకే బతుకు తెరువు కోసం భార్యతో పాటు వరంగల్ చేరుకున్నాడు. ఇప్పుడు వీళ్లకో ఏడాది కొడుకు కూడా. పట్టణ జీవితానికి అలవాటు పడుతూ సారయ్య రిక్షా తొక్కడం నేర్చుకున్నాడు. అతని భార్య లక్ష్మి చిన్న చిన్న కాంట్రాక్టర్ల వద్ద రోజు కూలీకి పని చేస్తున్నది.

* * *

లక్ష్మి నడుస్తోంది.

నడుస్తూనే ఆలోచిస్తోంది.

భర్త గురించి, తన బతుకు గురించి – "ఎసోంటోడు ఎట్లయ్యిండు! ఆ గోదారికగ్గిదలుగా దాన్ని తీస్కపొయ్యి గంగల కలుప, అది పొలాలు పాడు జెయ్యకుంటే మా ఇండ్లను ముంచకుంటే మా బతుకులు మేం బతికెటోల్లం. రాజోలె బతికెటోనికి రిక్షా తొక్కె కాలమొచ్చె"నంటూ గతాన్ని నెమరేసుకుంటోంది.

ఏ చెడు అలవాట్లూ లేని భర్త తాగుడుకు బానిసవడం, ఇంటి పని చేసుకునే తాను కూలిపని చేయాల్సి రావడం, తాగి ఊరికే వుండకుండా భర్త, గుడిసెలో లొల్లి చేయడం జ్ఞాపకం వచ్చి లక్ష్మి విపరీతంగా బాధపడుతోంది. ఇంతలో ఎక్కడికి అన్న మాట వినిపించడంతోనే లక్ష్మి ఆలోచనలతో పాటు నడక కూడా ఆపేసింది. ఎదురుగా తానుడబ్బు లడిగేందుకు వెళుతున్న మేస్త్రీ భార్య. ఇద్దరు పిల్లలతో పాటు ఆమె ఒకే గొడుగులో సర్దుకుని ఇంటి గేటు వద్ద నిలబడి వుంది. బహుశా ఆమె ఏ సినిమాకో లేక బంధువుల ఇంటికో వెలుతూ తనను చూసే ఆగినట్లు లక్ష్మి గ్రహించింది. లక్ష్మి తేరుకుని "మీ ఇంటికే వచ్చా"నంది. అయ్య గారి కోసం, కూలి డబ్బులు అడుక్కునేందుకు వచ్చినట్టు చెప్పింది. లోపలే వున్నాడు, వెళ్లమంటూ పిల్లలతో బయటికి వెళ్ళిపోయింది మేస్త్రీ భార్య.

మేస్త్రీ లోపలే వున్నందుకు లోలోపలే సంతోషపడింది లక్ష్మి మాపటికైనా నాలుగు మెతుకులు తినగలమన్న ఆశతో. గేటు తీసుకుని లోపలికి వస్తున్న లక్ష్మిని చూసి మేస్త్రీ తనలో తానే సంబరపడ్డాడు, మనసులో అప్పుడే మొగ్గ తొడుక్కున్న ఆలోచనకు. లక్ష్మి కప్పుకున్న వరుకు సంచిని పక్కన పెట్టి గడప బయట నిలబడింది. మేస్త్రీ లోపల కుర్చీలో కూర్చున్నాడు. "రా లక్ష్మీ రా!" అంటూ లోపలికి ఆహ్వానించాడు. లక్ష్మి లోపలికి అడుగు పెడుతూనే తాను డబ్బుల కోసం వచ్చానంది. వాటినిప్పిస్తే వెళ్ళిపోతానంది.

మేస్త్రీ వెంటనే ఏమీ మాట్లాడలేదు. కొద్ది సేపయ్యాక అన్నాడు 'ప్రస్తుతం తన వద్ద డబ్బులు లేవని సినిమా కెళతానంటే ఇప్పుడే భార్యకిచ్చి పంపానని.

లక్ష్మిని ఒక్కసారి నిరాశ ఆవరించింది. అయినా ఆశ చంపుకోలేక ఎలాగయినా ఇప్పించమంటూ బతిమిలాడింది. మూడు పూటల నుండి ఒక్క ముద్ద కూడా నోట్లో పెట్టలేదని తన గోడు చెప్పుకుంది.

మేస్త్రీ ఏమీ మాట్లాడకుండా సిగరెట్ వెలిగించాడు.

ఒక్కసారి లక్ష్మి వంక ఓరగా చూసి గట్టిగా ఓ దమ్ము లాగాడు ఇద్దరి మధ్యా మౌనం చోటు చేసుకుంది. క్రమక్రమంగా సిగరెట్ పొగ గది

నిండా ఆవరిస్తోంది. మేస్త్రీ లక్ష్మి వైపే చూస్తు న్నాడు. లక్ష్మికి ఇబ్బందికరంగా వుందా చూపు.

క్షణాలు దొర్లిపోతున్నాయి.

సిగరెట్ కాలిపోతోంది,

మేస్త్రీ ''కాగి''పోతున్నాడుస

అప్పటిదాకా మౌనంగా కూర్చున్నవాడల్లా సిగ రెట్‌ను నేల మీద పడవేసి కాలితో నలిపి నీకెంతివ్వాలంటూ లేచి నిలబడ్డాడు.

ఇరవై రూపాయిలంది లక్ష్మి.

'అయితే నలభై ఇస్తానంటూ ఓ నవ్వు నవ్వాడు మేస్త్రీ.

ఆకాశంలో హఠాత్తుగా ఓ మెరుపు మెరిసింది.

ఆ మెరుపే తన ఒళ్ళంతా పాకినట్లు లక్ష్మి ఉలిక్కిపడింది.

వెంటనే తేరుకుని తానలాంటిదాన్ని కాదంది.

"నేను మాత్రం అలాంటివాన్నా?" అంటూ మేస్త్రీ ఆమె వైపే రాసాగాడు.

లక్ష్మి వద్దంటూనే వెనక్కి జరుగుతోంది. అదేమీ పట్టించుకోనట్లు మేస్త్రీ ఆమె వైపే వస్తున్నాడు. పరిస్థితి విషమించిందని గ్రహించిన లక్ష్మి బయటికి ఉరికేందుకు ప్రయత్నించింది. కానీ ఆమెకా అవకాశం ఇవ్వకుండానే ఒక్క ఉదుటున ఆమెను అందుకున్నాడు. లక్ష్మి బ్రతిమలాడింది, పెనుగులాడింది. చివరికి పెద్దగా అరిచింది కూడా. కాని అవేవీ ఆమెను ఆదుకోలేకపోయాయి.

బయట చినుకులు ఉధృతమై కుండపోతగా వర్షం కురవసాగింది.

ఇంటి తలుపులు తెరుచుకునే వున్నాయి అన్యాయాన్ని అడ్డేదెవరన్నట్టు. పావుగంట ఏక ధాటిగా కురిసిన వర్షం మళ్లీ యథాస్థితికి వచ్చినా లక్ష్మి కళ్ళు మాత్రం ఇంకా వర్షిస్తూనే వున్నాయి.

'ఇదిగో' అన్న పిలుపుతో శోకం నుండి తేరుకుని ఈ లోకంలోకి వచ్చింది. భర్తజ్ఞాపకం వచ్చి మళ్ళీ బావురుమంది.

రెండు ఎర్రనోట్లు తీసి లక్ష్మిమీద పడేసి వెళ్ళి మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు మేస్త్రీ. అసలే తిండి లేక నీరసంగా వున్న లక్ష్మికి ఇప్పుడు మరీ చేతగాడం లేదు. బలవంతంగా శక్తిని కూడ గట్టు కొని లేచి నిలబడగలిగింది. రెండు ఇరవై నోట్లలో ఒకదానిని కొంగున కట్టుకొంది.

ఇంకొక దానిని మేస్త్రీ ముఖాన విసిరికొట్టి ముఖం మీద ఛాండ్రించి ఉమ్మింది, అంతకంటే ఇంకేమీ చాతకాక.

తెమ్పుకున్న వరుకు సంచీ కప్పుకుని బయటికి నడిచింది.



ఇటీవల హైదరాబాద్‌లో మహానటుడు శ్రీ ఎన్.టి. రామారావు జన్మదిన సందర్భంగా ఎన్.టి.ఆర్. చే 'విజేత' పుస్తకం అందుకుంటున్న జర్నలిస్ట్ తలశిల నాగేశ్వరరావు

ముసురు అలాగే వుంది.

ముసరుకు తోడు బయట చీకట్లు కూడా ముసురుకుంటున్నాయి. కప్పుకున్న వరుకు సంచి మీద చినుకులు టప టపా పడుతున్నాయి.

లక్ష్మి కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలుతు న్నాయి.

లక్ష్మి నడుస్తోంది.

నడుస్తూనే విలపిస్తోంది.

తాను ఏ దేవుని గుళ్లో మన్ను బొయ్యలేదం టోంది.

ఏ దేవుని కొండకూ నిప్పు పెట్టలేదంటూనే నడుస్తోంది.

నడుస్తూనే ఏడుస్తోంది. ఏడుస్తూ ఏడుస్తూ చివరికి గుడిసెకు చేరింది. కొడుకు నాడిస్తున్నాడు సారయ్య. సూటిగా భర్త కళ్ళల్లోకి చూడలేక కొడుకుని చంకనేసుకుని లోనికి వెళ్లింది.

లక్ష్మిని చూడగానే సారయ్యకు సగం ప్రాణం లేచి వచ్చింది.

ఉండబట్టలేక అడిగేశాడు ''పైసలిచ్చిండా'' అని.

అతి కష్టం మీద లక్ష్మి ''ఊ'' అని మాత్రం అనగలిగింది.

మళ్ళీ అడిగాడు సారయ్య ''బియ్యం తేనా?'' అని.

''ఆ'' అంది లక్ష్మి.

డబ్బులు కొంగుకున్నాయని చెప్పి కొడుకు రం నిమురుతూ ఉండిపోయింది.

కొంగు ముడి విప్పగానే సారయ్య కోరిక రెక్కలు తొడుక్కొంది. బియ్యం తేవడానికి కంటూ ఓ చేయిసంచి పట్టుకుని బయట పడ్డాడు.

*       *       *

చీకటి చిక్కపడుతోంది.

సారయ్య ఇంకా ఇంటికి రాలేదు. ఆకలౌతు న్నదో యేమో పిల్లగాడు పాలకేడుస్తున్నాడు. కదు పులో ఏ మాత్రం ఆసరా లేక పాలివ్వాలని పించడం లేదు లక్ష్మికి. భర్త ఎప్పుడు వస్తాడో నంటూ ఎదురుచూడసాగింది.

ఆమె ఎదురు చూపులతో పాటు పిల్లగాడి ఏడుపు కూడా ఎక్కువౌతోంది. అయినా సారయ్య జాడేలేదు. చుట్టుపక్కల గుడిసెలలోని గుడ్డి దీపాలు ఒక్కొక్కటే ఆరిపోతున్నాయి. లక్ష్మిలో అసహనం పెరిగిపోతోంది కానీ పిల్లవాడి ఏడుపు మాత్రం తగ్గడం లేదు.

ఇక చేసేదేమీ లేక కొడుకు నోటికి రొమ్మం దించి మంచం మీద కొరిగింది లక్ష్మి.

ఎంతసేపు గడిచిందో ఏమో కాని,

''తాగర అన్నా తాగి ఊగర అన్నా

ఊగర అన్నా ఊగి తాగర అన్నా'' అని తూలుకుంటూ ఇంటికొస్తున్న సారయ్య గొంతు దూరంగా వినిపిస్తూ దగ్గరౌతోంది. అందరి ఆకళ్ళూ తీర్చిన లక్ష్మికి మాత్రం తన ఆకలి తీరదని గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదు. ■